నిలిచిన ఇళ్ల నిర్మాణ పనులు

నున్న గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గృహ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పునాదులు వేసి వదిలేసిన ఇళ్లకు ఉపయోగించిన ఐరన్ తుప్పు పట్టి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తోంది.


పునాదుల స్థితిలోనే నిలిచిపోయిన ఇంటి నిర్మాణం

విజయవాడరూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఇళ్లు లేని పేదలకు నున్న గ్రామంలో నాలుగు లేఅవుట్లలో 6,363 కుటుంబాలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. వాటిలో 5,673 గృహాలను నిర్మించుకునేందుకు అనుమతులు వచ్చాయి. 761 గృహాలు పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఆ కుటుంబాల వారు జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. మిగిలిన వాటిలో 2,157 బేస్‌మట్టం దశలో, 15 గుమ్మలు దశలో, 278 శ్లాబు వరకు నిర్మించారు. 64 గృహాలు శ్లాబులు వేసి ఉన్నాయి. ఎన్నికల పిమ్మట కూటమి ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తుందని ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో నిరాశపడుతున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పిచ్చి మొక్కలు మొలిచి అడవులను తలపిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభంకాని చోట్ల పాములు, పురుగులు తిరుగుతుండటంతో సమీపంలో నివాసం ఉంటున్న వారు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.1.8 లక్షలను విడుదల చేసినట్టయితే లబ్ధిదారులే స్వయంగా ఇళ్ల నిర్మించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వర్షం వస్తే బురదలోనే..

జగనన్న కాలనీల్లో నివసించే ప్రజలకు కనీసం రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత నెల్లో కురిసిన వర్షాలకు అంతర్గత రోడ్లు దెబ్బతిని రోడ్లు రూపమే మారిపోయింది. వర్షం వస్తే బురదలోనే రాకపోకలు సాగించడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో వీధి దీపాలు సరిగా వెలగడంలేదని, కాలనీలో నివాసం ఉండే వారు పనుల కోసం విజయవాడ, ఆటోనగర్, ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డ్యూటీలు ముగించుకుని రాత్రి సమయాల్లో ఇంటికి తిరిగి రావడం కోసం అవస్థలు పడుతున్నామని, రోజుకు కనీసం ఒక ట్రిప్పు ఆర్టీసీ బస్సును నడపాలని కోరుతున్నారు.

సిమెంటు, ఇసుక సరఫరా చేయాలి



నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణ పనులు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించాలి. సొంతంగా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సిమెంటు సరఫరా చేయాలి. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను ఇవ్వాలి. – షేక్ హుస్సేన్, కాలనీ వాసి

సొంతింటి కల నెరవేర్చాలి



లబ్ధిదారులకు ప్రభుత్వం గృహాలను నిర్మించి ఇవ్వాలి. అద్దె ఇళ్లల్లో అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి. పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలి. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి. – దండు సుబ్రహ్మణ్యంరాజు, నున్న

సిండి'కేట్లు' హవా



మద్యం షాపులను దక్కించుకున్న బడా బాబులు



పెనమలూరు: మండల పరిధిలో మద్యం షాపులను సిండికేట్లు కైవసం చేసుకున్నారు. మచిలీపట్నంలో సోమవారం జరిగిన లాటరీలో సిండికేట్లదే హవా కనబడింది. తాడిగడప మున్సిపాలటీలో మూడు మద్యం షాపులు, పెనమలూరు మండలంలో ఐదు మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే తాడిగడప మూడు మద్యం షాపులకు 160 దరఖాస్తులు, పెనమలూరులో ఐదు మద్యం షాపులకు 92 దరఖాస్తుల చొప్పున అందాయి. అయితే బడా బాబులు కొందరు సిండికేట్లుగా ఏర్పడి మద్యం షాపులకు దరఖాస్తులు వేశారు. కాగా సోమవారం లాటరీలో ఇలా సిండెకేట్లుగా ఏర్పడి దరఖాస్తు చేసుకున్న వారికే మద్యం షాపులు కైవసం చేసుకున్నారు. తాడిగడప మున్సిపాలిటీలో ఒకే వ్యక్తికి రెండు మద్యం షాపులు దక్కాయి. మరో షాపు ఇంకో సిండికేట్ కైవసం చేసుకుంది. పెనమలూరులో కూడా మద్యం షాపులు సిండికేట్లకే దక్కాయి.

తాడిగడప ప్రజలకు బార్లే గతి

తాడిగడప మున్సిపాలిటీలో 3.50 లక్షల మంది జనాభా ఉంటే కేవలం మూడు మద్యం షాపులు మాత్రమే నోటిఫికేషన్‌లో ప్రకటించారు. పెనమలూరు మండలంలో 70 వేల జనాభాకు ఐదు మద్యం షాపులు ఇచ్చారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో 11 బార్‌లు ఉండటంతో వాటి యజమానుల ప్రయోజనం కోసం మద్యం షాపుల సంఖ్య పథకం ప్రకారం తాడిగడప మున్సిపాలిటీలో తగ్గించారనే ఆరోపణలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో కేటాయించిన మూడు మద్యం షాపులు దూరంగా ఏర్పాటు చేస్తే సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం లేదు. మద్యం ప్రియులు గత్యంతరం లేక బార్‌లకే వెళ్లి అధిక ధరలకు మద్యం కొనుగోలు చేసుకునే పరిస్థితి ఉంది.

టీడీపీ నాయకులకే అత్యధిక లైసెన్స్‌లు

గన్నవరం: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 23 మద్యం దుకాణాల లైసెన్స్‌లను అత్యధిక శాతం టీడీపీ నాయకులే దక్కించుకున్నారు. మచిలీపట్నంలో సోమవారం లాటరీ పద్ధతిలో మద్యం షాపులకు లైసెన్స్ జారీ ప్రక్రియను ఎక్సైజ్ శాఖ పూర్తిచేసింది. తొలుత ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గన్నవరం మండలంలో 9, ఉంగుటూరు మండలంలో 5, బాపులపాడు మండలంలో తొమ్మిది మద్యం షాపులకు మొత్తం 453 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో సిండికేట్‌గా ఏర్పాడి పెద్ద ఎత్తున్న దరఖాస్తులు వేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అనుచరులు అధిక శాతం షాపులను లాటరీలో దక్కించుకున్నారు. వీరిలో తెలుగు యువత నేత పరుచూరి నరేష్ పేరున ఏకంగా నాలుగు షాపుల లైసెన్స్‌లు వచ్చాయి. యార్లగడ్డ వర్గీయుల బెదిరింపులను లెక్కచేయకుండా దరఖాస్తులు వేసిన పలువురు టీడీపీ నేతలు కూడా డ్రాలో మద్యం షాపుల లైసెన్స్‌లను దక్కించుకున్నారు. కర్ణాటక రాష్ట్ర అడ్రస్‌తో ఉన్న గొంది రాంబాబు అనే వ్యక్తికి కూడా వైన్‌షాపు లెసెన్స్ రావడం గమనార్హం.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: పెదపులిపాక చిన్నకట్టపై మోటార్ బైక్ పై వెళుతున్న ఓ వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు అటకాయించి దాడి చేయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు తోట్లవల్లూరు మండలం పెనమకూరుకు చెందిన గుండాల సిద్దుకుమార్ కానూరులో ఉంటూ తాడిగడప మున్సిపాల్టీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. అతను పెదపులిపాకలో ఉన్న వరుసకు అక్క మేరీ ఇంటికి రాత్రి భోజనానికి వెళ్లాడు. భోజనం ముగించుకుని పెదపులిపాక నుంచి రాత్రి బయలుదేరి చిన్నకట్ట మీదగా వస్తుండగా ముగ్గురు వ్యక్తులు సిద్ధకుమార్‌ను అటకాయించి కర్రతో దాడి చేశారు. దీంతో సిద్ధకుమార్ బైక్ వదిలి పక్కనే ఉన్న కాలువలో దూకి తప్పించుకున్నాడు. కొద్ది సమయం తరువాత సిద్దుకుమార్ వచ్చి చూడగా ముగ్గురు వ్యక్తులు వెళ్లిపోవటంతో బైక్‌లో తిరిగి తన అక్క ఇంటికి వచ్చి జరిగిన ఘటన చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


మృతుడు లీలాకృష్ణ

గన్నవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై గన్నవరం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు విజయవాడ రూరల్ మండలంలోని ఎనికేపాడు గ్రామానికి చెందిన నందమూరి లీలాకృష్ణ(35) కొత్త ఆటోనగర్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గన్నవరం మండలం ముస్తాబాదలోని అతడి స్నేహితుడ్ని కలిసేందుకు లీలాకృష్ణ బైక్‌పై వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణమైన అతను ముస్తాబాద శివారులోని పేద చెరువు వద్దకు రాగనే బైక్ అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో లీలాకృష్ణ తలకు బలమైన గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న అతడ్ని స్థానికులు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లీలాకృష్ణ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా గ్యార్మీ పండుగ


గ్యార్మీ పండుగలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: గంగూరు గ్రామంలో సోమవారం గ్యార్మీ పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో భక్తులు గ్యార్మీ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్యార్మీ జెండాలతో గ్రామంలో ప్రదర్శన చేశారు. అనంతరం జెండాలను జెండా చెట్టు వద్ద ఉంచారు. మండల పరిధిలో ముస్లింలు గ్యార్మీ పండుగలో పాల్గొన్నారు. సుమారు ఐదు వేల మందికి భోజనాలు పెట్టారు. పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి చేత ముస్లిం మత గురువులు ప్రార్థనలు చేయించారు. అనంతరం అనారోగ్యంతో ఉన్న సర్పంచ్ తస్లీమున్నీసాను కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు గని, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు చదువులో రాణించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: మహిళలు చదువులో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక జ్యోతినగర్‌లోని జేఎంజే మహిళా జూనియర్ కాలేజీలో స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.4 లక్షల వ్యయంతో వెయిటింగ్ హాల్ నిర్మాణం చేపట్టారు. ఈ హాల్ నిర్మాణానికి సత్యప్రసాద్, శ్రీదేవి సోమవారం శంకుస్థాపన చేశారు. దాతలు సత్యప్రసాద్ దంపతులకు జేఎంజే మహిళా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సిస్టర్ అంతోనమ్మ, ఇతర అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు మేడేపూడి రామ్మోహనరావు, వరిగంజి కిషోర్, దాసరి బెనర్జీ, దయాల ప్రభాకరరావు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు


అమ్మవారి ఊరేగింపులో కళాకారుల విన్యాసాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ మెయిన్ రోడ్డులో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఉంచి మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలు, కోలాటం, బేతాళసెట్టుతో ఊరేగింపు జరిగింది. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు అమ్మవారి ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో..

మధరానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. 11 రోజులుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు వేదపండితులచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం దాత కుంచనపల్లి రవిశంకర్ దంపతులతో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను పాలక వర్గం సభ్యులు పర్యవేక్షించారు.


ముత్యాలంపాడులో అన్నప్రసాద వితరణ

క్లుప్తంగా

క్రీడా సామగ్రి అందజేత



కంకిపాడు: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కోలవెన్ను ఉపసర్పంచ్ కంచర్ల చిన్ని, మాజీ ఉపసర్పంచ్ కంచర్ల శేషగిరి అన్నారు. కోనేరు భాగ్యలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.10 వేలు, కొడాలి భానుదీప్ రూ.10 వేలు ఆర్థిక వితరణ అందించటంతో ఆ మొత్తంతో జెడ్పీ పాఠశాలకు అవసరమైన క్రీడా సామగ్రిని సమకూర్చి సోమవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతిభగల క్రీడాకారులు ఆసక్తి గల రంగాలను ఎంచుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.కమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జపమాల మహోత్సవం



పెనమలూరు: కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో ఆదివారం రాత్రి జపమాల మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన మహోత్సవాలు 13వ తేదీ రాత్రి ముగిశాయి. తొలుత జపమాల మహోత్సవం సమష్టి దివ్యబలి పూజ చేశారు. ఫాదర్లు బొల్లికింద జయరాజ్, చాలివేంద్రశౌరి, మైత్రి దేవదానం, రత్నరాజ్ ప్రార్థనలు చేసి భక్తులకు దివ్యప్రసాదం అందజేశారు. ఈ ఉత్సవాల్లో సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, సంఘ పెద్దలు, దళ సభ్యులు, కామయ్యతోపు, పోరంకి, గంగూరు, కానూరు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం

గన్నవరం: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సేవా భవనంలో ఈ నెల 15వ తేదీన ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన కృష్ణసాయి దంత వైద్యశాల, మ్యాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి వైద్యుల నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని రిటైర్డ్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి మాగంటి విరాళం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయం అభివృద్ధికి ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు రూ.25 వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు విరాళం నగదును ఆయన అందజేశారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మను దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి, సేవాసదన్ నిర్మాణానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి విరాళాలను అందజేయడంపై శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెట్టుబడులపై అవగాహన సదస్సు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ పెట్టుబడిదారుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పెట్టుబడులపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో సెబీ (సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా)కి చెందిన ప్రముఖ శిక్షకుడు డాక్టర్ ఓలేటి అచ్యుత్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పెట్టుబడులు పెట్టడంలో మెలకువలు, పొదుపు సేవలు, స్టాక్ మార్కెట్, ద్రవ్యోల్బణం, షేర్లు, బాండ్లు, మ్యూచువల్ ఫండ్లు తదితర పెట్టుబడి అంశాల గురించి విద్యార్థినులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో మెలకువలు తెలుసుకుని రాణించడానికి ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుధారాణి, సత్యవాణి, డాక్టర్ బాలకృష్ణ, అరుణ, సుమిత్ర, ప్రసాదరావు, దివ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామవరప్పాడు: ఇటీవల నిర్వహించిన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఆటల పోటీల్లో రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఏవీ తాయారు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం పాఠశాల్లో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా తాయారు మాట్లాడుతూ ఖోఖో సీనియర్ విభాగంలో హర్ష, కబడ్డీ సీనియర్ విభాగంలో డి.కార్తీక్, కె.సాయిచరణ్, కె.పుండరి, వి. కొండలరావు, కబడ్డీ జూనియర్ విభాగంలో వెంకటేష్ మనోజ్, పవన్‌సాయి, వాలీబాల్ సీనియర్ విభాగంలో మధు గోపాల్ తరుణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. యోగా సీనియర్ బాలుర విభాగంలో మణికంఠ, సతీష్, జూనియర్ విభాగంలో ఉదయ్ సుమంత్, బాలికల కబడ్డీ సీనియర్ విభాగంలో పూజిత, మౌనిక, ఖో ఖో సీనియర్ విభాగంలో తనూజ, దీపిక, రాజేశ్వరి, పల్లవి, ఖేతిక శ్రీ, సుహస్యలహరి, యోగా జూనియర్స్ బాలికల విభాగంలో హాసిని, తాంతికుమారి, సీనియర్స్ విభాగంలో వైష్ణవి, తన్మయిలు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల, జగదీశ్వరి, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


నున్నలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

విజయవాడరూరల్: గన్నవరం నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నున్న గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.51 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు గ్రామ సర్పంచ్ కాటూరి సరళతో కలిసి సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం కోటకట్ట సెంటర్ గౌడ బజారులో ఉపాధి నిధులు రూ.25 లక్షలతో నిర్మించే రోడ్డు పనికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తొలుత అంబాపురం గ్రామం నాల్గో వార్డులో రూ.35 లక్షల ఉపాధి నిధులతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి, పి.నైనవరం గ్రామంలో రూ.25 లక్షల ఉపాధి నిధులతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి, పాతపాడు గ్రామంలో రూ.10 లక్షల ఉపాధి నిధులతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గండికోట సీతయ్య, బట్టా సోమయ్య, దేవగిరి సుజాత, ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణప్రసాద్, ఏఈ శివరామకృష్ణ, గ్రామాల కార్యదర్శులు జీటీవీ రమణ, పి.కోటిలింగమ్మ, డి.శ్రీనివాసరావు, సంతోష్ పాల్గొన్నారు.

మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన


సాయిలోహిత్


రాజ్‌కుమార్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాల(ప్రభుత్వ ఎయిడెడ్)కు చెందిన ఇరువురు విద్యార్థులు నీట్‌లో మెరుగైన ర్యాంక్‌లతో మెడికల్ సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాల్లో సదరు విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల్లో బైపీసీ పూర్తిచేసిన టి. సాయిలోహిత్ నీట్‌లో 16,882 ర్యాంక్ సాధించి, ఆంధ్ర మెడికల్ సైన్స్ కళాశాల్లో సీటు దక్కించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా 94,175 ర్యాంకర్ జే రాజ్‌కుమార్ గుంటూరు మెడికల్ కళాశాల్లో సీటు సాధించినట్లు తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదవడం వల్ల ఇద్దరు విద్యార్థులకు ఉన్నత విద్యకు అర్హత లభించిందన్నారు. మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకట్ మోటపర్తి, కార్యదర్శి జీఎల్ఎస్ఎన్. ప్రసాద్, అధ్యాపకులు ఉన్నారు.

పీఎం సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న ఈఈ కృష్ణనాయక్

ఉయ్యూరు: పీఎం సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ అన్నారు. పట్టణంలోని కేసీపీ ఆడిటోరియంలో ఉయ్యూరు సబ్ డివిజన్ స్థాయిలో పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలి యోజన పథకంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణనాయక్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కోసం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లకు రావాలని సూచించారు. డెప్యూటీ ఈఈ జి.హేమకుమార్, సోలార్ వెండర్స్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌పై నిలిచిన లారీ.. ట్రాఫిక్‌కు అంతరాయం


జాతీయ రహదారిపై నిలిచిన లారీ

గన్నవరం: నిత్యం రద్దీగా ఉండే చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో సోమవారం ఓ లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విజయవాడ నుంచి ఏలూరు వైపుగా వెళ్తున్న లారీ మరమ్మతులకు గురై ఒక్కసారిగా జాతీయ రహదారిపై నిలిచిపోయింది. సుమారు మూడు గంటల పాటు లారీ అక్కడే నిలిపి ఉంచడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అయితే కంచికచర్ల నుంచి ఆ లారీని డ్రైవర్ లేకుండానే క్లీనర్ నడుపుకుంటూ వచ్చాడు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్దకు రాగనే గేర్లు సరిగా పడకపోవడంతో లారీ నిలిచిపోయింది. సదరు క్లీనర్ మద్యం తాగి ఉండడంతో ట్రాఫిక్ పోలీసులు అతడి వద్ద వివరాలు తెలుసుకుని లారీ యజమానికి సమాచారం ఇవ్వడంతో ఆయన ఇక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు దృష్ట్యా వాహనాన్ని పక్కకు తొలగించాలని చెప్పిన ట్రాఫిక్ పోలీసులపై లారీకి చెందిన వ్యక్తులు గొడవకు దిగారు. చివరకు ట్రాఫిక్ పోలీసులు గట్టిగా హెచ్చరించడంతో క్రేన్ సాయంతో లారీని ఊరు బయటకు తీసుకెళ్లారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో సమస్య పరిష్కారమైంది.

రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం


ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు విరాళం అందజేస్తున్న అవుతు శివారెడ్డి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ నిధులు రూ.51లక్షలతో నిర్మించే సిమెంటు రోడ్డుకు తన తండ్రి అవుతు గురవారెడ్డి పేరు నామకరణం చేయాలని అవుతు శివారెడ్డి రూ.10 లక్షల విరాళాన్ని చెక్ ద్వారా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు అందజేశారు. సోమవారం నున్న గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవుతు శివారెడ్డి విరాళం చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే శివారెడ్డికి పూల మాల వేసి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాటూరి సరళ, కార్యదర్శి జీటీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.